# జ్ఞానోదయం

**చింతా రాంబాబు**

శ్రీహరికి కొత్తగా పెళ్ళయింది.

ఇంకా సంవత్సరం కూడ పూర్తి కాలేదు.

దాంతో ఇంకా కొత్త అల్లుడిగానే చెలామణి అవుతున్నాడు.

ఇప్పుడు దీపావళి పండక్కి భార్యతో కలసి అత్తగారింటికి రావడం జరిగింది.

పండుగరోజు అంతా నవ్వుతూ తుళ్ళుతూ సరదాగా ఉంటే శ్రీహరి మాత్రం ముభావంగా ఉండిపోయాడు.

ఆ రాత్రి "బాంబులంటే బావగార్కి భయం లాగుంది. ఒక్కటీ కాల్చటం లేదు. కనీసం కాకర పూవ్వొత్తన్నా కాల్చండి" అంటూ మరదలు వేళాకోళం చేస్తే అప్పుడైనా నోరు విప్పి నవ్వలేదు.

విప్పితే ఎలాగ? ఈ రెండు రోజులు కాస్త రిజర్వ్‌డుగానే ఉండాలనుకొన్నాడు.

సంతోషంగా కనిపిస్తే అసలు పట్టించుకోవడం మానేస్తారు.

ఇలా అంటీఅంటనట్టు ఉంటేనే తన పని కాస్త సులువు అవుతుంది.

ఆ రాత్రి పడుకోబోతుండగా "ఏమిటండీ: వచ్చిన దగ్గర్నుండి అదోలా ఉంటున్నారు? వంట్లో బాగుండలేదా?" నుదుటిమీద చెయ్యి వేస్తూ అడిగింది భార్య విశాల.

"బాగానే ఉంది" ముక్తసరిగా అన్నాడు శ్రీహరి.

"బాగా వుంటే, ఓమాట పలుకు లేకుండా ఎందుకు బిగదీసుకొన్నట్టు? వచ్చినప్పుడల్లా ఎంతో సరదాగా ఎన్నో కబుర్లు చెప్పే బావగారు ఎందుకలా వున్నారంటే ఏం చెప్పాలో తెలియలేదు" నిష్ఠూరంగా అంది విశాల.

శ్రీహరి విననట్లే ఊరుకొన్నాడు.

"ఏమిటండీ మాట్లాడరు?" భర్తను కుదుపుతూ రెట్టించింది విశాల.

"అది సరేకాని విశాల! పండుగ బహుమతిగా మీవాళ్ళు ఏం ఇద్దామనుకొంటున్నారు?" మెల్లిగా అసలు విషయంలోకి దిగాడు శ్రీహరి.

"ఓహ్, అదా మీ భయం! ఇలా సీరియస్‌గా ఉంటేనేకాని బహుమతి ఇవ్వరనుకొన్నారా ఏమిటీ?" నిలదీసింది విశాల.

"అదికాదు విశాల!" తడబడ్డాడు శ్రీహరి.

"ఏది కాదండీ! వెధవ బహుమతి కోసం పండుగరోజు ఎవరన్నా ఇలా ఉంటారండీ! అయినా మావాళ్ళు వాళ్ళ శక్తికి తగ్గట్టు ఏదో ఇచ్చి పంపుతారే కాని వట్టి చేతుల్తో మాత్రం పంపరు లెండి" కాస్త కోపంగానే అంది విశాల.

"అదే ఏం ఇద్దామనుకొంటున్నారు?" ఉండబట్ట లేక అడిగాడు శ్రీహరి.

"ఏం ఇస్తారు! మనిద్దరిని బట్టలు కొనుక్కోమని చెరికొక మూడు వందలు ఇస్తారనుకొంటున్నాను" భర్త మనసులో ఉన్నదేమిటో తెలియక మామూలుగా అంది విశాల.

"అంతేనా?" అన్నాడు శ్రీహరి.

"ఏం చాలవా? పోని మీరు 'అంతేనా' అంటున్నారు కాబట్టి మీకు ఇంకో వందో, రెండు వందలో ఎక్కువ ఇమ్మని రికమండ్ చేస్తాను లెండి" వాతావరణాన్ని తేలికపర్చే ఉద్దేశంతో నవ్వుతూ అంది విశాల.

ఇంకా అసలు విషయం ప్రస్తావించకపోతే లాభం లేదనుకొన్నాడు శ్రీహరి.

"విశాలా! నేను ఉద్యోగంలో జాయినయిన దగ్గర్నుండి నెల నెలా కూడబెట్టింది దాదాపు ఓ అయిదు వేల వరకూ ఉందన్న సంగతి నీకు తెలుసుకదూ?"

"తెలుసు. అవి మన సూట్‌కేస్ అడుగున ఉన్న కవరులో భద్రంగా వున్నాయన్న సంగతి కూడ తెలుసు."

"ఆ అయిదువేలకి తోడు ఇంకో అయిదు వేలు పండుగ బహుమతిగా ఇస్తే కలర్ టి. వి. తీసుకుందాం."

భర్త మాటలకి ఖిన్నురాలైంది విశాల. వెంటనే తేరుకొని "ఏమిటండీ పండుగ బహుమతి అయిదు వేలా?" ఆశ్చర్యంగాఅడిగింది.

"ఏం, అంత ఆశ్చర్యం! అంతలేనివాళ్ళా మీ వాళ్ళు" వ్యంగ్యంగా అన్నాడు శ్రీహరి.

మధ్య తరగతి కుటుంబాల్లో అయిదు వేలంటే మాటలా! మతి ఉండే మాట్లాడుతున్నారా!"

శ్రీహరికి కోపం వచ్చేసింది.

"మతి ఉంది కాబట్టే టీ. వి. కోసం నా దగ్గరున్న అయి దు వేలు కూడ కలుపుకొని ఇంకో అయిదు వేలు మాత్రమే అడుగుతున్నాను. లేకపోతే పదివేలే అడిగేవాణ్ణి.

"అయినా పండుగ బహుమతి అయిదు వేలంటే అత్యాశేనండీ" భర్తకు నచ్చచెప్పే ధోరణిలో అంది విశాల.

"ఎందుకు అత్యాశ అవుతుంది? పెళ్ళయిన పదేళ్ళకి మొన్న నా పక్క సీటు సుబ్బారావుకు వాళ్ళ మామ కూతురు మోజు పడుతుందని నాలుగు వేలు పెట్టి టి. వి. కొన్నాడు. ఆయన పరిస్థితి మరి మీనాన్న పరిస్థితే."

"కావచ్చు. కాని, ఇప్పుడు మా నాన్న ఉన్న పరిస్థితి వేరండి. మా తమ్ముడికి పాలిటెక్నికల్ కాలేజిలో సీటు వచ్చింది. పదివేలు డొనేషన్ కట్టాలట. ఇంకా దానికే పూర్తిగా డబ్బు సర్దుబాటు కాక నానా అవస్థ పడుతున్నారు. ఇంకా నేనెలా అడగ్గల్నండీ"

"ఫర్వాలేదు. దానికి తోడు ఇంకో అయిదు వేలు సర్దుబాటు చేసుకొని ఇమ్మను" నిక్కచ్చిగా అన్నాడు శ్రీహరి.

భర్తకెలా నచ్చచెప్పాలో అర్థం కాలేదు విశాలకు. క్షణాల్లో ఆమె మనసు గందరగోళంగా తయారైంది.

భార్య ఆలోచనల్లో పడటం చూసి శ్రీహరి "నాకు మాత్రం మీ వాళ్ళని బాధ పెట్టడం ఇష్టం అనుకుంటున్నావా విశాలా! మీ వాళ్ళు మనకిచ్చే చివరి బహుమతి కూడ ఇదే. నేనేమీ ఆ డబ్బుతో స్కూటరు కొనుక్కొంటాననడం లేదే! మనిద్దరి కోసం, పుట్టబోయే మన పిల్లల కోసం కలర్ టీ.వి కొంటానంటున్నాను. హైదరాబాద్‌లో మన ఇల్లు తప్పించి టీ.వి. లేని ఇల్లు ఇంకేదైనా ఉందంటావా? చెప్పు" అన్నాడు.

"పోని మీకంతగా మనసైతే బ్లాక్ అండ్ వైట్ తీసుకొందామండి" భర్త ఔనంటాడేమోనన్న ఆశతో అంది విశాల.

వెంటనే మళ్ళీ శ్రీహరికి కోపం వచ్చేసింది.

"ఆపు, నీ బోడి సలహా. దానికింత రాద్ధాంతం ఎందుకు? ఇప్పట్లో తీసుకుంటే కలర్ టీ.వియే తీసుకోవాలి. లేకపోతే మానుకోవడం మంచిది" కోపంగా అన్నాడు.

"పోని ఇంకో పని చేద్దామండీ" ఉత్సాహం తెచ్చుకొంటూ అడిగింది విశాల.

"ఏమిటది?" అన్నాడు శ్రీహరి విసుగ్గా.

"ఇప్పుడు మన దగ్గరున్న డబ్బు కట్టేసి, నెలనెలా ఇంతని కట్టే వాయిదాల పద్ధతి మీద తీసుకొందాము" ఎలాగైనా భర్త మనసు మార్చాలన్న పట్టుదలతో అంది విశాల.

"పద్ధతి బాగానే ఉంది కాని అది మనవల్ల అయ్యే పని కాదు విశాల! బ్రహ్మచారిగా ఉండి నాలుగు వేలు కూడబెట్టడానికి నాలుగేళ్ళు పట్టింది. ఇంకా ఇప్పుడు అదికూడ చెయ్యలేని పరిస్థితి. వచ్చే జీతంలో ఇంటి అద్దెకి, పాల ఖర్చుకే సగం పోతోంది. ఇంకా నెలనెలా ఏం మిగల్చగలం?"

నిజమేననిపించింది విశాలకు.

ఇంకా ఏం మార్గాలు భర్తకు తెలియ చెప్పాలో తెలియక నిస్సహాయంగా చూసింది.

వెంటనే 'తళుక్'న విశాల మెదడులో ఇంకో ఆలోచన మెదిలింది.

"పోని, ఇలా చేసేద్దామండి. కట్నంగా మావాళ్ళు నాకిచ్చిన ఎకరం పొలం అమ్మేద్దాం."

"ముష్టి అయిదు వేల కోసం ముప్పైవేలు ఖరీదు చేసే పొలం అమ్ముకోవడానికి సిద్ధపడుతున్నావు కాని, మీ వాళ్ళని మాత్రం అడుగవు" అరచినంత పని చేశాడు శ్రీహరి.

"ఇంట్లో ఇంకా పెళ్ళి కావల్సిన ఇద్దరు చెల్లెళ్ళని, చదువు పూర్తి కావల్సిన ఇద్దరు తమ్ముళ్ళని పెట్టుకొని ఎలా అడ గగ్లనండీ? నాకు నోరు రావడం లేదు" విశాలకు కళ్ళనీళ్ళ పర్యంతరం అయింది.

"ఎలా అడుగుతావో నాకు అనవసరం. నాకు మాత్రం బహుమతిగా అయిదు వేలు కావల్సిందే" మొండిగా అన్నాడు శ్రీహరి.

ఇంకా ఏం చెప్పినా భర్త మనసు మారదని గ్రహించిన విశాల, ఇంకా అతని పక్కన పడుకోవడం మనస్కరించక కింద దుప్పటి పరచుకు పడుకొంది.

శ్రీహరి కూడ అదేమీ పట్టించుకోకుండా ముసుగు తన్ని పడుకొన్నాడు.

పడుకొన్నాడే కాని శ్రీహరికి కూడ భార్యనిలా బాధపెట్టవల్సి వచ్చినందుకు లోపల బాధగానే ఉంది.

ఇంకో మార్గం లేనప్పుడు తప్పదు మరి.

తన ఆఫీసులో ప్యూన్ను సైతం ప్రతీవాళ్ళు చిన్నదో, పెద్దదో టీ.వి. ఉన్న వాళ్ళే! తెల్లారి పొద్దుటే అంతా ఆఫీసుకి రాగానే రాత్రి టీవిలో వచ్చిన ప్రోగ్రాంల గురించి మాట్లాడుకొంటుంటే తను వాళ్ళ సంభాషణల్లో పాలు పంచుకోలేక పోతున్నాడు.

ఎప్పుడన్నా ఏదన్నా తెలియక అడుగబోతే "ఏమిటి, మీ ఇంట్లో టీ.వి. లేదా!" వింతగా అడుగుతుంటే ఎంతో చిన్నతనం అనిపించేది.

రాత్రి తన ఇంటి మీద పిడుగు పడిందన్నా వాళ్ళు అంత ఆశ్చర్యంగా అడగరేమో!

దాంతో వాళ్ళందరికి తనొక శ్రోతగా మిగిలి పోయాడు.



Saraswata Niketanam, Vetapalem.

రేపు టీ.వి తీసుకోగానే ఆఫీసులో అడుగని వాళ్ళకి సైతం ఏకంగా తను కలర్ టీ.వియే తీసుకొన్నానని చెప్పి తీరవల్సిందే!

మొన్నటికి మొన్న తన కోలీగ్ సూర్యం ఇంటి కెళ్ళినప్పుడు "ఇంకా నీవు ఇప్పుడు ఇంటి కెళ్ళి చేసేది ఏముంది? ఇంకో పావు గంటలో టీ.వి.లో సినిమా వసు_్తంది, చూసి వెళ్ళు" ఎంతో ఉదారంగా అన్నాడు.

వాడిది బ్లాక్ అండ్ వైట్ టీ.వియే.

రేపు తను కలర్ టీ.వి. కొన్నానని చెప్పినప్పుడు వాడి మొహం చూడాలి. వెధవన్నర వెధవని!

"పోర్టబుల్ టీ.వి. అన్నా తీసుకోరా" అంటూ ఎంతో సానుభూతిగా మాట్లాడే వాడు.

తెల్లార పొద్దుటే శ్రీహరి నిద్ర లేవంగానే రోజులా "బావగారు! మొహం కడుక్కోను బాత్‌రూములో నీళ్ళు పెట్టమంటారా? నీళ్ళు కాగాయ్" అంటూ ప్రేమగా కాసుకొన్నట్టు వచ్చే మరదలు ఆ పొద్దుట రాలేదు.

తనను చూడంగానే "గుడ్ మార్నింగ్ బావగారు!" అంటూ ఎంతో సంతోషంగా విష్ చేసే ఇంకో మరదలు పిల్ల తను ఎదురుపడ్డా గమనించనట్లే ఊరుకొంది.

తను నిద్ర లేవంగానే ఎవరి చేతిలో ఉన్నా పేపరు లాక్కొచ్చి తన చేతిలో పెట్టే బావమరిది ఈ రోజు అలవాటు లేకపోయినా తనే చదువుతూ కూర్చొన్నాడు.

## జ్ఞానోదయం

దీనినిబట్టి తన బహుమతి సంగతి అప్పటికే భార్య ఇంట్లో చెప్పేసిందన్న సంగతి గ్రహించాడు శ్రీహరి.

పాపం మామగారు మాత్రం ఎప్పటిలా మామూలుగానే మెసలడం జరిగింది.

మొత్తం మీద ఇంట్లోని వాతావరణం గంభీరం గానే కనిపించింది శ్రీహరికి.

అయినా ఇవేమీ అతను లెఖ్ఖ చెయ్యదల్చుకో లేదు.

తను కూడ గంభీరంగా ఉండిపోయాడు.

ఇంకా ఆ సాయంత్రం తమ ఊరికి బయల్దేరతా రనంగా ఆ మధ్యాహ్నం అయిదువేలు తీసుకొచ్చి భర్త చేతిలో పెట్టింది విశాల.

కోత విధించకుండా అడిగిన మొత్తం చేతిలో పడినందుకు శ్రీహరి సంతోషపడ్డాడు.

మర్యాదకోసం "ఈ డబ్బుకోసం మీ నాన్నగారేమీ అవస్థపడలేదు కదా?" అన్నాడు.

"అవస్థేమీ లేదు. మా తమ్ముడి చదువుకోసం దాచిన అయిదువేలు మీకు ఇవ్వడం జరిగింది" మొహం తిప్పుకొంటూ అంది విశాల.

"మరి పాపం అతని పాలిటెక్నిక్ సీటో?"

"ఇంకేం సీటండీ! ఇంకో అయిదువేలు కోసం అవస్థ పడకుండా మా వాళ్ళకి చాలా గొప్ప మేలు చేశారు. పొద్దుటనుండి వాడి మొహం చూడలేక తప్పుకు తప్పుకు తిరుగుతున్నాను" బాధతో విశాల గొంతు బొంగురు పోయింది.

వెంటనే శ్రీహరి ఆలోచనలు ఓ ఏడెనిమిది సంవత్సరాలువెనక్కి వెళ్ళాయి.

అప్పుడు తను ఇంటర్మీడియేట్ ఫస్టుక్లాసులో పాసయ్యాడు. తమ ఊళ్ళో డిగ్రీ కాలేజి లేకపోవడంతో వేరే ఊళ్ళో ఉండి చదువుకోవల్సిన పరిస్థితి.

ఆ వేరే ఊళ్ళో కాలేజిలో తనకు సీటు రావటం, అక్కడ ఉండి చదువుకోటానికి వీలుగా రూము తీసుకోవడం అన్ని ఏర్పాట్లు జరిగి పోయాయి.

అందుకు కావల్సిన మూడు నాలుగు వేలు డబ్బు కూడ తండ్రి సమకూర్చాడు.

అప్పుడే పండుగకి తన అక్కా బావ ఇంటికి రావటం జరిగింది.

పండుగ మరుసటిరోజు, బావగార్కి రోజూ ఆఫీసుకి బస్సులో వెళ్ళి రావటం చాలా కష్టంగా ఉందని, ఓ నాలుగు వేలిస్తే లూనా కొనుక్కుంటా నంటున్నారని అక్క చెప్పినప్పుడు తండ్రి గుక్క తిప్పుకోలేక పోయాడు.

చాలామంది మధ్య తరగతుల్లాగానే తమది కూడ ఉండీలేని సంసారం. అలాంటిది నాలుగు వేలంటే మాటలా?

ఆ మాట చెప్పటానికి అక్క లోపల ఎంత బాధ పడిందో ఆమె మొహం చూడంగానే తెల్సిపోయింది.

ఎందుకంటే రాత్రి గదిలో వాళ్ళెంత మెల్లిగా మాట్లాడుకున్నా భార్యా భర్తలిద్దరూ ఎందుకో

### సరిక్రొత్త సీరియల్
### పైవారం వివరాలు
### రాజముద్రిక

చాళుక్య భూపతుల రాజముద్రిక వరాహాలాంఛనం. కడు సొంపై, ఉభయ తలాలు అంచులు తీర్చబడి, కింది భాగం నాలుగు రేకుల పువ్వులా వుండి, కర్ణిక ఉండే చోట వలయంతో తావడం చేసి వుంది. ఉపరితలం మధ్యలో 'త్రిభువనాంకుశం' అనే బిరుదాక్షరాలున్నాయి. శాసనభాష అయిన ప్రాకృత లిపి, వరాహ లాంచనంతో పాటు చంద్రుడు, అంకుశం, శంఖం, ఛత్ర చామరం, దీపం శెమ్మెలు ముద్రిక మీద చోటు చేసుకున్నాయి. అడుగు భాగాన తామరపువ్వు వుంది. అతి ముఖ్యులు, పంచ ప్రధానులకు మాత్రమే ఈ ముద్రిక లభించేది. కోటలో ఎక్కడికైనా యదేచ్ఛా ప్రవేశానికి ఉపకరించేది ఈ ముద్రికే !



చాళుక్య రాజముద్రిక
(వరాహ లాంఛనం)

ఈ రాజముద్రికకీ, మీరు త్వరలో చదువ బోయే సీరియల్ కి చాలా దగ్గరి సంబంధం వుంది. ఏమా సీరియల్ ?

వచ్చేవారం చూడండి !

ఘర్షణ పడ్డారన్న సంగతి ఇంట్లో అందరికీ తెల్సిపోయింది.

అప్పటి తన తండ్రి పరిస్థితి దయనీయం

అటు కూతురు సంసారం, ఇటు కొడుకు భవిష్యత్తు.

ఇంట్లో కూడబెట్టి దాచుకొంది మూడు నాలుగువేలు మాత్రమే.

ఎటూ తేల్చుకోలేక తల్లడిల్లి పోతుంటే తనే గుండె చిక్కపట్టుకొని "నాన్నా! నేను కాలేజీలో జాయినవ్వను. మన ఊళ్ళోనే ఉండి టైపు నేర్చుకొంటా"నని చెప్పినప్పుడు తండ్రి తన తల నిమురుతూ జాలిగా చూడటం తప్పించి మరేం మాట్లాడలేక పోయాడు.

ఆ చూపుల్లోని నిస్సహాయత, ఆవేదన కడుపున పుట్టినందుకు కొడుకుగా తనుమాత్రమే అర్థం చేసుకోగల్గాడు.

తన భవిష్యత్తుని పణంగా పెట్టి ఆడబ్బు బావగార్కి ఇవ్వడం జరిగింది.

ఆనాడు తను డిగ్రీయే పూర్తి చేసి ఉంటే తన భవిష్యత్తే వేరుగా ఉండేది.

ఏ బ్యాంకులోనో, ఏ గవర్నమెంటు ఆఫీసులోనో ఆఫీసరయి ఉండేవాడు.

ఇలా టైపిస్టు కం గుమస్తాగా సెటిలయ్యేవాడు కాదు.

ఆనాడు తన భవిష్యత్తుని బలితీసుకొన్న బావగారి మీద కలిగిన అసహ్యం, కోపం ఈనాటికీ తన మనసులో అలాగే ఉండిపోయాయి.

మరి ఇప్పుడు తను చేస్తున్న పనేమిటి?

క్షణాల్లో శ్రీహరికి జ్ఞానోదయం అయింది.

వెంటనే తన పెట్టెడుగున దాచుకొన్న అయిదు వేలు కూడ బయటికి తీసి భార్య చేతిలో పెడుతూ "విశాల! ఈ పదివేలు మీ నాన్నగారికిచ్చి మీ తమ్ముడ్ని పాలిటెక్నికల్‌లో జాయిన్ చేయించమను" అన్నాడు

భర్త ప్రవర్తనకు విశాల విస్తుపోయింది!

క్షణంసేపు నోట మాట రాలేదు కూడ.

"ఇదేమిటండీ! కావలిస్తే వాళ్ళ అయిదువేలు వాళ్ళకిచ్చేద్దాం. మనం దాచుకొన్న అయిదు వేలు కూడ ఎందుకు?" తేరుకొని అంది.

"ఇంకో అయిదు వేలు కోసం తంటాలు పడుతున్నారన్నావుగా! ఈ అయిదు కూడ ఇవ్వు" శాంతంగా అన్నాడు శ్రీహరి.

భర్త ప్రవర్తన ఆమెకు వింతగాను, అయోమయంగాను ఉంది.

"అది కాదండీ....." అంటూ ఆమె ఇంకేదో అనబోతుంటే

"ప్లీజ్ విశాల! ఇంకేమీ మాట్లాడకు. తీసికెళ్ళి మీ నాన్నగార్కి ఇవ్వు. మనస్ఫూర్తిగా చెప్తున్న మాట ఇది" అంటూ శ్రీహరి అక్కడినుండి కదిలి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత మామగారు ఆయనిచ్చిన అయిదు వేలు తీసుకోక పోవటం అటుంచి, ఇంకో అయిదు వేలు కూడ జతచేసి ఇచ్చినందుకు బాధపడి పోతుంటే "పోని, అప్పుగా ఉంచండి మామగారు! రేపు మీ అబ్బాయి చదువు పూర్తయి ఉద్యోగం వచ్చాక అతనే తీరుస్తాడు" అంటూ శ్రీహరి బలవంతంగా ఆయనకు నచ్చచెప్పటం జరిగింది.

అల్లుడి మంచితనానికి ఆ మామగారి గొంతు మూగబోయింది.

తనపట్ల మామగారి కళ్ళల్లోని కృతజ్ఞత, బావమరిది కళ్లలోని ఆరాధన, భార్య కళ్ళల్లోని ప్రేమానురాగాలు చూసిన తర్వాత 'అయ్యో! టీ. వి. లేకపోయిందే' నన్న బాధ శ్రీహరి మనసులో మచ్చుకైనా మిగల్లేదు.

ఆసాయంత్రం బస్సుస్టాండులో వెంట వచ్చిన తమ్ముళ్ళకి, చెల్లెళ్ళకి వీడ్కోలు పలికి, భర్త చెయ్యి పట్టుకొని గర్వంగా తన ఊరు బస్సెక్కింది విశాల.

○

## స్టిల్ నిజం-డైలాగ్ అబద్ధం



### బహుమతిపొందిన 'డైలాగ్'

"ఆ సుకుమారి పప్పు రుబ్బుతూంటే అంత చూడలేని వాడివైతే ఒక మిక్సీ కొని పారేయ రాదూ? మీ చెల్లాయికి!"

-ఆర్. శ్రీజ్యోతి (ఏలూరు)

(వీరికి 3మాసాల పాటు ఆంధ్రసచిత్రవారపత్రిక బహుమతిగా పంపబడుతుంది.)

### మరికొన్ని డైలాగ్‌లు

"మీ ఆవిడ మా పోర్షన్‌లో పప్పు రుబ్బుకోవటానికి వచ్చినప్పుడల్లా బాత్రూంకి తాళం వేయటం ఏం బాగోలేదండీ? "

-బి. మురళి (తెనాలి)

"హోటల్‌కొచ్చి నీతో టిఫిన్ తినడం పొరపాటయ్యిందిరా రాస్కెల్... నా బట్ట లిప్పిస్తే నీ చేత పిండి రుబ్బించేలా ఉన్నారురా...!"

- వియంరావు కనకాల (కాకినాడ)